సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 29 । ఆగస్టు । 2025

పాహి..పాహి.. ఘణాధిపా..!

ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజమ్।
పాశాంకుశ ధరం దేవం ధ్యాయే త్సిద్ధి వినాయకమ్.. అంటూ ధ్యానించి

భక్తులంతా విఘ్నాధిపతికి ఘనంగా పూజలు చేశారు.

వినాయక చవితినాడు వాడవాడలా విశేషమైన రీతిలో మండపాలను నెలకొల్పారు.

గణనాథుడిని 'ఘన'మైన రూపాల్లో కొలువుంచి వేడుకలు చేశారు.



ఏకదంతం..మహాకాయం : అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్‌లో కొలువదీరిన 126 అడుగుల భారీ గణపతి



శివశివ మూర్తివి గణనాథా : చోడవరంలో కొలువైన 63 అడుగుల వినాయకుడు



నీలమేఘశ్యాముడిలా.. అనకాపల్లి వేల్పుల వీధిలో 36 అడుగుల గణపతి

న్యూస్‌రీల్

ఒడ్డిమెట్ట గణపతి ఆదాయం రూ.4 లక్షలు



ఒడ్డిమెట్టలో హుండీలు లెక్కిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

నక్కపల్లి : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధి గాంచిన ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతికి ఒక్క రోజు ఆదాయం సుమారు రూ.4 లక్షలు లభించిందని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైలా నూకన్న నాయుడు తెలిపారు. గురువారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల ను లెక్కించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రూ.20 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ద్వారా రూ56,230, రూ.10 టికెట్ల ద్వారా రూ.53,300, తలనీలాలు టికెట్ల ద్వారా రూ.3500, దాతలు ఇచ్చిన విరాళాలు ద్వారా రూ.82,960, భక్తులు హుండీల్లో వేసిన కానుకల ద్వారా రూ.2,03,091 మొత్తం రూ 3,99,081 లభించిందన్నారు.

బంగారు పతకాలు సాధించిన బాక్సర్లు



విజేతగా ప్రకటిస్తున్న కోచ్

నర్సీపట్నం : తిరుపతిలో జరిగిన అమరావతి అండర్-22 చాంపియన్‌షిప్ రాష్ట్ర బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నంకు చెందిన మహిళా బాక్సర్లు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. 81 కిలోల విభాగంలో యర్రా తేజస్విని, 75 కిలోల విభాగంలో బొంతు మానిక బంగారు పతకాలు సాధించారు. విజయం సాధించిన బాక్సర్లు ఈ నెల 29న విశాఖలో జరిగే స్పోర్ట్స్ డే కార్యక్రమంలో పతకాలు అందుకోనున్నట్లు కోచ్ ప్రియాంక తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వినయ్‌కుమార్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (ఫైనాన్స్)గా సెయిల్ కార్పొరేట్ ఆఫీస్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్ వినయ్ కుమార్ ఎంపికయ్యారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో బుధవారం సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీ (ఎస్‌సీఎస్‌సీ) నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 13 మంది అభ్యర్థులను పరిశీలించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి నలుగురు. సెయిల్ నుంచి ఏడుగురు, ఎన్ఎండీసీ, ఎన్‌సీఎల్ ఇండియా లిమిటెడ్ నుంచి ఒక్కొక్కరు చొప్పున వచ్చిన దరఖాస్తుల్లో వినయ్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

మీ జాతకాలు నా దగ్గరున్నాయి!

- జాగ్రత్తగా పనిచేయండి
- ఎమ్మెల్యేలకు జనసేన అధినేత హితవు
- బాబు తరహాలోనే ర్యాంకులిస్తానంటూ ప్రకటన
- కార్యకర్తలను పట్టించుకోవడం లేదంటూ నేతలపై విమర్శలు
- అవినీతి ఆరోపణల్లో విశాఖ ఎమ్మెల్యేలే టాప్..!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

'మీ జాతకాలు అన్నీ నా వద్ద ఉన్నాయి. ఎవరెవరు ఏమి చేస్తున్నారో నాకు తెలుసు. పదవి అనేది మనకు సేవ చేసేందుకు లభించిన అవకాశం. కానీ కొంత మంది తమ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలున్నాయి. కనీసం మనల్ని నిలబెట్టిన కేడర్‌ను కూడా పట్టించుకోకుండా వ్యక్తిగత ప్రయోజనం కోసం మాత్రమే పనిచేస్తున్నారు. ఇది సరికాదు. ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా ర్యాంకింగ్ కూడా ప్రకటిస్తా మీ పద్ధతి మార్చుకోండి. లేదంటే నా తరహాలో నేను సరిదిద్దాల్సి వస్తుంది' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. మూడు రోజుల పాటు విశాఖలో తలపెట్టిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాల్లో భాగంగా మొదటి రోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పనితీరు ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తానని తెలపడంతో పాటు ప్రతీ ఒక్కరి పనితీరును అంచనా వేసేందుకు ప్రత్యేక మెకానిజం కూడా ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా మనకు అవకాశం కల్పించిన ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎమ్మెల్యేల్లో మెజార్టీ సభ్యులపై ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయని.. వీటిని వెంటనే సరిదిద్దుకుని ముందుకు వెళ్లాలని హితవు పలికినట్టు తెలుస్తోంది. అదేవిధంగా మీ తీరు మారకపోతే నేను నా పద్ధతిలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించినట్టు సమాచారం. మొత్తంగా చంద్రబాబు తరహాలో ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేస్తున్నామని తెలపడంతో పాటు ర్యాంకులు కూడా ఇస్తామని చెప్పడం గమనార్హం. విశాఖలో మూడు రోజుల పాటు జరుగుతున్న సమావేశాల్లో మొదటిరోజు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ కార్యవర్గంతోనూ సమావేశమయ్యారు. ఈ నెల 30వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి.

ఉమ్మడి విశాఖ ఎమ్మెల్యేలే టాప్..!

ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ముగ్గురిపై భారీ స్థాయిలో ఆరోపణలు గుప్పుమంటున్నాయనే చర్చ జరిగినట్టు సమాచారం. మైనింగ్ నుంచి పోస్టింగుల వరకూ.. ప్రతీ పనికి ఓ రేటు కట్టి వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా భూకబ్జా ఆరోపణలు కూడా వస్తున్నాయని పవన్ కళ్యాణ్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఏకంగా ఒక ఎమ్మెల్యేపై నేరుగా కొంత మంది చంద్రబాబుకే ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే చంద్రబాబు కేబినెట్ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలతో మాట్లాడి సరిదిద్దుకోవాలని సూచించినట్టు కూడా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేల పనితీరుపై పవన్ పూర్తిస్థాయిలో అసంతృప్తిని వెలిబుచ్చినట్టు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే మండలానికి ఒకరిని నియమించి వసూళ్లు చేపడుతుండగా.. మరో ఎమ్మెల్యే సోదరుడు మొత్తం పెత్తనమంతా చేస్తున్నారని కూడా పవన్ దృష్టికి వచ్చినట్టు సమాచారం. ఇక మరో ఎమ్మెల్యే అందినకాడికి దండుకుంటున్నారని కూడా పక్కా సమాచారం వచ్చినట్టు తెలుస్తోంది. మరో ఎమ్మెల్యేపై నేరుగా ఫిర్యాదులు లేకపోయినప్పటికీ.. ఆయన అల్లుడిపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని కూడా పవన్ పేర్కొన్నట్టు చర్చ జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని మొత్తం నలుగురి ఎమ్మెల్యేల పనితీరుపై పవన్ అసంతృప్తిని వెలిబుచ్చినట్టు ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

చంద్రబాబు ఆదేశాలతోనే...!

వాస్తవానికి గత నెలలో జరిగిన కేబినెట్ సమావేశంలో కూటమిలోని ఎమ్మెల్యేలపై విమర్శలు వస్తున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా టీడీపీ ఎమ్మెల్యేలను పిలిచి మందలించి పంపుతున్నానని.. బీజేపీ, జనసేన అధ్యక్షులు కూడా వారి ఎమ్మెల్యేలను పిలిచి తప్పులుంటే సరిచేసుకోవాలని చెప్పాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే జనసేన ఎమ్మెల్యేలకు పవన్ క్లాస్ పీకారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా తమ ఎమ్మెల్యేలకు పనితీరు ఆధారంగా చంద్రబాబు తరహాలో రేటింగ్ కూడా ఇస్తానని చెప్పడం పట్ల జనసేన నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రతీ పార్టీ పనితీరుకు ప్రత్యేకమైన విధానం ఉంటుంది. మరో పార్టీ స్టైల్‌ను ఫాలో కావడం మంచిది కాదు. చంద్రబాబు కేబినెట్ సమావేశంలో ఆదేశించారంటూ.. సొంత పార్టీ ఎమ్మెల్యేలను ఈ తరహాలో క్లాస్ పీకడం సరికాదు' అని సమావేశంలో పాల్గొన్న ఓ నేత అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ అధినేత నిరంతరం ఈ విధంగా సమావేశం కావడం మంచిదేనని.. కార్యకర్తలు చెప్పే సమస్యలు వింటే బాగుంటుందనే అభిప్రాయాన్ని కొందరు పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

తండ్రీ కొడుకుల విషాదాంతం

- రైలు ఢీకొని కుమారుడు, కాలువలో పడి తండ్రి మృతి
- పాయకరావుపేటలో ఘటన



రైలు ఢీకొట్టి మృతి చెందిన బాలుడు గుణశేఖర్

పాయకరావుపేట: ఇంట్లో గొడవ పడి కుమారుడిని తీసుకొని వెళ్లిపోయిన తండ్రి కాలువలో శవమై తేలగా.. కుమారుడిని రైలు ఢీకొట్టిన విషాద ఘటన పాయకరావుపేటలో చోటు చేసుకుంది. తుని రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగాల కాలనీలో బొర్రా అనిల్ భార్య, కుమారుడు గుణశేఖర్(8) కలిసి నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం మద్యం సేవించిన అనిల్ భార్యతో గొడవపడ్డాడు. వెంటనే కుమారుడిని తీసుకొని సొంతూరు గుంటూరు వెళ్లిపోతానని ఇంటి నుంచి బయలు దేరాడు. పట్టణంలోని నాగరాజుపేట రైల్వే గేటు సమీప తాండవ బ్రిడ్జిపై వెళ్తుండగా రైలును ఢీకొని గుణశేఖర్ మృతి చెందాడు. ఇదిలా ఉండగా తన భర్త కనిపించడం లేదని అనిల్ భార్య బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేయగా తాండవ రైల్వే బ్రిడ్జి కింద నీటిలో అనిల్ మృతదేహం లభ్యమైంది. పాయకరావుపేట నుంచి తుని వెళ్లడం కోసం వంతెన పైనుంచి వెళ్తుండగా రైలు ఢీకొట్టి గుణశేఖర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వాసితులకు నమ్మక ద్రోహం

అరణ్యరోదన..

- రూ.25 లక్షల ప్యాకేజీ కోసం ఏడాదిగా ఆందోళన
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రూ.8.98 లక్షల చొప్పున చెల్లింపు
- గుట్టుగా నిర్వాసితుల బ్యాంకు ఖాతాల సేకరణ
- టీడీపీ అనుకూల వర్గాలకు ముందుగా పరిహారం జమ



ఇళ్ల స్థలాల కేటాయింపు కార్యక్రమం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

నక్కపల్లి : బల్క్ డ్రగ్‌పార్క్, స్టీల్‌ప్లాంట్ కోసం నివాస ప్రాంతాలు త్యాగం చేసిన నిర్వాసితులను కూటమి ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచింది. గత ఏడాదినుంచి నిర్వాసితులు చేస్తున్న ఆందోళన అరణ్యరోదనే అయింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంపై స్పష్టత ఇస్తేనే గాని ఇంటి స్థలాలు తీసుకోమని ఆందోళన చేస్తున్న నిర్వాసితుల్లో చీలిక తెచ్చింది. ప్యాకేజీ రూ.8.98 లక్షలు కన్నా ఎక్కువ ఇచ్చేది లేదని స్పష్టం చేసింది. ప్లాట్లు తీసుకోకపోతే ఇబ్బంది పడతారని ప్రచారం చేసి ముందుగా టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి ప్లాట్లు కేటాయించింది. దీంతో గత్యంతరం లేక మిగిలిన వారు కూడా ప్లాట్లు తీసుకున్నారు. అదేవిధంగా నేడు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలోనూ ఇదే సూత్రాన్ని పాటించింది. నిర్వాసితుల్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న వారి బ్యాంకు ఖాతాలు సేకరించి వారి పేరున రూ.8.98 లక్షల చొప్పున జమ చేసింది. మిగిలిన వారు తీసుకోకపోతే ప్యాకేజీ వెనక్కి పోతుంది... అంటూ ప్రచారాన్ని మొదలు పెట్టింది.

నాడు మాయమాటలు..

2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. న్యాయ పోరాటం చేస్తున్న రైతులకు 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మాయమాటలు చెప్పింది. 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని నమ్మించింది..దీంతో రైతులు భూములు ఇచ్చారు. నష్టపరిహారం చెల్లింపుల విషయం వచ్చేసరికి అప్పటి చంద్రబాబు సర్కారు రైతుల్లో చీలిక తెచ్చింది. టీడీపీకి అనుకూలంగా ఉన్న రైతులను భూములు ఇచ్చేందుకు ఒప్పించింది. జిరా యితీ భూములకు ఎకరాకు రూ.18 లక్షల చొప్పు న, డీఫారం భూములకు ఎకరాకు రూ.12 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. కొంతమంది రైతులు నివాస ప్రాంతాలను కోల్పోవాల్సి వచ్చింది. వారికి కూడా 2013 భూసేకరణ చట్టప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, పునరావాసం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

అధికారం వచ్చాక ప్లేటు మార్చి....

2024లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఐఐసీ సేకరించిన భూములను బల్క్ డ్రగ్ పార్క్‌కు 2వేల ఎకరాలు, మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు 2020 ఎకరాలు కేటాయించింది. భూములు స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించింది. నివాస ప్రాంతాల వారికి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏడాది నుంచి నిర్వాసితులు ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం ఇళ్లు కోల్పోతున్న వారి కుటుంబాల్లో యజమానికి, మేజర్లయిన కుమారులకు ఐదు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం నిమిత్తం రూ.8.50 లక్షలు చెల్లిస్తామని తెలిపింది. దీనిని నిర్వాసితులు వ్యతిరేకిస్తూ 2013 భూసేకరణ చట్టప్రకారం ఐదు సెంట్ల ఇంటి స్థలంతో పాటు, యజమానులకు, మేజర్లయిన కుమా రులకు, వివాహం అయిన ఆడపిల్లలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని రూ.25లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు ప్రభుత్వం 735 మంది నిర్వాసితులను గుర్తించింది.రాజయ్యపేటలో 104 మంది, ఎ.ఎల్‌పురంలో 31 మంది, వేంపాడులో 196 మంది, చందనాడలో 143 మంది, బుచ్చిరాజుపేటలో 172 మంది, నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో ఇళ్లు ఉన్నవారిని 89 మందిని గుర్తించింది. వీరందరికీ పెదబోదిగల్లం వద్ద కొనుగోలు చేసిన 165 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు లాటరీ పద్ధతిన కేటాయించింది.

విభజించి...నట్టేట ముంచి...

- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో స్పష్టత ఇస్తే గానీ ప్లాట్లు తీసుకోబోమని ఆందోళన చేస్తున్న నిర్వాసితులను పచ్చనేతలు ప్రలోభాలకు గురి చేసి టీడీపీకి అనుకూలంగా ఉండే వారిని ఒప్పించి వారికి ముందుగా ప్లాట్లు కేటాయించారు. రూ.25లక్షలు ప్యాకేజీ చెల్లించాలని ఏడాది నుంచి డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదు. రూ.8.98 లక్షలు కన్నా ఎక్కువ ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. రైతులు అంగీకరించపోవడంతో ముందుగా టీడీపీ అనుకూల వర్గాల బ్యాంకు ఖాతాలు సేకరించి వారి పేరున రూ.8.98 లక్షల చొప్పున జమ చేసేసింది.

నమ్మి మోసపోయామంటున్న రైతులు

ఏడాది పాటు తమ డిమాండ్లను అధికారులు, హోం మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.. న్యాయం చేస్తామంటూ నమ్మబలికిన కూటమి నేతలు..ఇపుడు మోసం చేసి కొంతమందికి గుట్టుగా ప్యాకేజీ సొమ్ము వారి ఖాతాల్లో జమ చేస్తుండడంపై నిర్వాసితులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. నిర్వాసితులను ప్రలోభాలకు గురి చేసి ప్యాకేజీ పెంచకుండా నట్టేట ముంచుతోందని వాపోతున్నారు.

నమ్మించి మోసగించారు..



కూటమి ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు చెల్లించాలని ఏడాది నుంచి డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదు. మాలో చీలిక తెచ్చి కొంత మందికి రూ.8,98 లక్షల చొప్పున ఆర్థిక సాయం బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. న్యాయం చేస్తామని నమ్మబలికి ఇలా మోసం చేయడం దుర్మార్గం. సర్వం కోల్పోయి వేరొక చోట బతకాలంటే ఎంత కష్టంగా ఉంటుందో తెలుసా... పడేవారికి ఈ బాధ తెలుస్తుంది. నిర్వాసితుల్లో కొంతమందిని తమ వైపునకు తిప్పుకుని ఉద్యమాన్ని నీరు కార్చేసారు. రెండేళ్లకిత్రం మాకు మద్దతు ఇచ్చారు.ఇప్పుడు ముఖం చాటేశారు..

-ఎస్.గోవిందరావు, చందనాడ

ఇంత దారుణమా...



తరతరాలుగా నివసిస్తున్న ఇళ్లు కోల్పోయాం. సర్వం నష్టపోయిన మాకు ఐదు సెంట్ల ఇంటి స్థలం, రూ.8.98 లక్షలు ప్యాకేజీ ఏమాత్రం సరిపోదు. దీనిపై ఆందోళన చేయగా మాలో చీలికలు తెచ్చారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారి నుంచి బ్యాంకు అకౌంట్లు తీసుకుని ముందుగా ప్యాకేజీ సొమ్ము వారి ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన వారు తీసుకోకపోతే నష్టపోతారని ప్రచారం చేస్తున్నారు. ఇంటి స్థలం కేటాయింపు విషయంలో కూడా ఇలాగే బెదిరించారు. ప్రభుత్వమే ఇలా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి. ఇచ్చే తొమ్మిది లక్షలతో వేరొక చోట ఇల్లు ఎలా నిర్మించుకుంటాం? అలాగే వివాహాలయిన ఆడపిల్లలకు సైతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వడం లేదు. టీడీపీ నాయకులు ప్రతిపక్షంలో ఒకలా, అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరిస్తున్నారు. పోరాటం మాత్రం ఆపే ప్రసక్తి లేదు.

– గెద్దమూరి గోవిందు, చందనాడ

2 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు



సింహాచలం: సింహగిరిపై వచ్చే నెల 2 నుంచి 6 వరకు పవిత్రోత్సవాలను విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. 2వ తేదీ సాయంత్రం 6 నుంచి రుత్విక్‌వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 3న ఉదయం 7 గంటల నుంచి శాంతిపాఠం, పవిత్రాధివాసం, యాగశాలార్చన, కుంభవాహనం, చక్రాబ్జమండలరచనం, పవిత్రప్రతిష్ఠ, సాయంత్రం 5 నుంచి గ్రామతిరువీధి ఉంటాయన్నారు. 4న ఉదయం విశేష ఆరాధన, హోమాలు, పారాయణాలు, సాయంత్రం తిరువీధి, రాత్రి పవిత్ర సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 5న ఉదయం పూర్ణాహుతి, పవిత్ర విసర్జనం, గ్రామతిరువీధి, 6న ఉదయం ఏకాంతస్నపనంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబరు 2 నుంచి 6 వరకు నిత్యకల్యాణంతో పాటు అన్ని ఆర్జిత సేవలు బంద్ చేసినట్లు తెలిపారు.

కబడ్డీ.. కబడ్డీ

- ఉరిమే ఉత్సాహం.. అదరగొట్టే యాక్షన్ సిద్ధం..
- నేటి నుంచి విశాఖ వేదికగా ప్రో కబడ్డీ 12వ సీజన్



ట్రోఫీ ఆవిష్కరణలో భాగంగా తొడగొడుతున్న 12 జట్ల కెప్టెన్లు

విశాఖ స్పోర్ట్స్: కబడ్డీ.. కబడ్డీ అంటూ కొదమ సింహాల్లా బరిలో నిలిచే ప్లేయర్లు సిద్ధమయ్యారు. అదరగొట్టే యాక్షన్ మొదలుకాబోతోంది. కబడ్డీ ప్రేమికులను ఉత్కంఠతో నిలబెట్టే ప్రో కబడ్డీ సీజన్-12 విశాఖ వేదికగా శనివారం ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గురువారం 12 జట్ల కెప్టెన్లు ట్రోఫీతో కలిసి ఫొటోలకు పోజిచ్చారు. పోటీకి సై అంటూ తొడకొడుతూ సవాల్ విసిరారు. ప్రముఖ క్రియేటర్లతో కలిసి మ్యాట్ మావెరిక్స్, రైడ్ మాస్టర్లు పేరిట రెండు జట్లుగా విడిపోయి కబడ్డీ ఆడారు. విశాఖ వేదికగా శుక్రవారం రాత్రి 8 గంటలకు తెలుగు టైటాన్స్-తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్‌తో లీగ్ ఆరంభం కానుంది. ఈసారి ప్రో కబడ్డీ ఫార్మాట్‌లో మార్పులు చేశారు. తొలిసారిగా జట్లు రెండు గ్రూపుల్లో ఆడనున్నాయి. తెలుగు టైటాన్స్ జట్టు 'బి' గ్రూప్‌లో ఉంది. ప్రతి జట్టు లీగ్ దశలో 18 మ్యాచ్‌లు ఆడుతుంది. ప్లే-ఆఫ్స్‌తో పాటు 'ప్లే-ఇన్‌లు' కూడా ప్రవేశపెట్టారు. తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే-ఇన్‌లు, ప్లే-ఆఫ్స్ ఆడతాయి. ఫలితం తేలని మ్యాచ్‌ల్లో విజేతను నిర్ణయించడానికి 'గోల్డెన్ రైడ్' విధానాన్ని తీసుకువచ్చారు. ఈ కొత్త ఫార్మాట్ భవిష్యత్తులో మరిన్ని లీగ్‌లలో అనుసరించవచ్చని ప్రో కబడ్డీ చైర్మన్ అనుపమ్ గోస్వామి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ సీజన్ ప్రారంభం కావడం విశేషం. గురువారం అంతర్జాతీయ క్రీడాకారుడు రాహుల్ చౌదరి వంటి వారిని సత్కరించారు. అలాగే సీజన్ ప్రారంభానికి ముందు కెప్టెన్లు ఐఎన్ఎస్ కురుసురను సందర్శించి సాయుధ దళాలకు నివాళులర్పించారు. ప్రో కబడ్డీ లీగ్-12ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించవచ్చు. ఈ సీజన్ టికెట్లను జొమాటో డిస్ట్రిక్ట్‌లో అందుబాటులో ఉంచారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక : స్థానిక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా అచ్యుతాపురానికి చెందిన చింతల శ్రీనివాసరావు(నేవీ), కళావతి దంపతులు రూ.2 లక్షలను గురువారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మళ్ల జోగారావు, ఆడారి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరుల త్యాగాలను వృథా కానివ్వం..


అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

అనకాపల్లి : విద్యుత్‌ఛార్జీలు పెంచినందుకు 25 సంవత్సరాల క్రితం హైదరాబాదులోని బషీరాబాద్‌లో ఆందోళన చేసిన వామపక్ష కార్యకర్తలైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలను అప్పటి టీడీపీ ప్రభుత్వం కాల్పులు జరిపించి అమానుషంగా మరణాలకు కారణమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో అమరవీరుల చిత్రపటానికి గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. రానున్న రోజుల్లో ప్రజల పక్షాన వామపక్ష నాయకులు పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని, చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దెదించే వరకూ విద్యుత్ వినియోగదారుల తరపున పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు వై.ఎస్.భద్రం, వియ్యపురాజు, కోరుబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, నరాలశెట్టి సత్యనారాయణ, రాజాన దొరబాబు, పాల్గొన్నారు.

జైబోలో గణేష్ మహరాజ్‌కి జై


భక్తులతో పూజలందుకున్న లక్ష్మీగణపతి


స్వామిని దర్శించుకునేందుకు క్యూలో వేచి ఉన్న భక్తులు


కంబాల జోగులుకు లక్ష్మీగణపతి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

- భక్తులతో పోటెత్తిన ఒడ్డిమెట్ట
- పసుపు అలంకరణలో చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడు

నక్కపల్లి: జైబోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ వినాయక చవితి పండగను బుధవారం భక్తులు వాడవాడలా ఘనంగా జరుపుకొన్నారు. ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయంలో చవితి వేడుకల కోసం దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. నక్కపల్లి మండల ప్రజలతో పాటు, అడ్డురోడ్డు, పాయకరావుపేట, యలమంచిలి, తుని, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఒడ్డిమెట్ట గణపయ్యను దర్శించుకున్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైలా నూకన్న నాయకుడు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ అధికారులు ఉచిత దర్శనాలతో పాటు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కూడా కల్పించారు. సాయంత్రం ఇక్కడ పెద్ద ఎత్తున తిరునాళ్లు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. స్వామిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి 10 కిలోల లడ్డూలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, ఈవో కిరణ్మయి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

పసుపు అలంకరణలో చోడవరం విఘ్నేశ్వరుడు

చోడవరం: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య ఆదిదేవుడు చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి చవితి పూజలు బుధవారం కనుల పండువగా జరిగాయి. వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. జై గణేష్ నామస్మరణతో మార్మోగింది. ఉత్సవాలను ఎమ్మెల్యే రాజు ప్రారంభించారు. స్వామివారికి పాలు, తేనె, నెయ్యితో అభిషేకాలు చేశారు. ఆలయంలో లక్ష్మీగణపతి హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి తిరువీధోత్సవం ఘనంగా జరిగింది. దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబతోపాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ఆలయ ప్రాంగణం కనువిందు చేసింది. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యాలు, వేంకటేశ్వరస్వామి భజన మండలి మహిళా బృందం వేసిన కోలాటకం ఆకట్టుకున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం శ్రీస్వయంభూ విఘ్నేశ్వరస్వామి పసుపు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


పసుపు అలంకరణలో చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి

సాగు భూములకు పట్టాలివ్వండి...

- జేపీ అగ్రహారం భూసమస్యను పరిష్కరించండి
- కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా



సాగు భూములకు పట్టాలివ్వాలని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తుమ్మపాల : ఏళ్ల తరబడి వివిధ పంటలతో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీసంఘం ఆధ్వర్యంలో రోలుగుంట మండలం జేపీ అగ్రహారం రైతులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. తహసీల్దార్ కృష్ణమూర్తి అక్రమంగా రైతుల భూములపై ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని, ఆ తహసీల్దార్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి, గేటు వద్ద ధర్నా చేపట్టారు. రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామంలో ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవిని రైతు ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేసి, సమస్యను వివరించారు. 1956 ఇనాముల రద్దు చట్టం, రైత్వారీ కన్వర్షన్ ప్రకారం 1967లోనే గ్రామంలో సర్వే నెం.1 నుంచి 93 వరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి రెవెన్యూ రికార్డుల్లో ఫారం-8 ఇచ్చారని, రైతుల భూమి శిస్తు చెల్లిస్తూ చేపడుతున్న క్రయవిక్రయాలను నిలిపివేసి ఇనాందారుల పేరుతో ప్రైవేటు వ్యక్తుల పేరున పట్టాలు మంజూరు చేయడం దారుణమని రైతు కూలీసంఘం (ఆంధ్ర ప్రదేశ్) జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు అన్నారు. ఐదు తరాలుగా సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వని అధికారులు, అక్రమ పద్ధతిలో ఇనాం భూముల పేరుతో రికార్డులను తారుమారు చేసి ప్రైవేటు వ్యక్తులకు పట్టాలివ్వడం దుర్మార్గమన్నారు. రైతుల సాగులో ఉన్న భూములు ప్రైవేటు వ్యక్తుల పేరున పట్టాలు మంజూరు చేసిన అప్పటి తహసీల్దార్ పి.కృష్ణమూర్తిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ప్రైవేట్ వ్యక్తుల పేరున ఇచ్చిన పట్టాలను రద్దుచేయాలన్నారు. రైతుల భూముల్లోకి ప్రైవేట్ వ్యక్తులు దౌర్జన్యంగా మంది మార్బలంతో వచ్చి రైతులపై దాడులు చేయడానికి, భూ ఆక్రమణకు చేస్తున్న ప్రయత్నాలను అరికట్టాలని కోరారు. రైతు నాయకులు రొంగలి రమణ, డి.బుచ్చిరాజు,దుంగల శంకరరావు, పెట్ల సత్యనారాయణ మాట్లాడుతూ జేపీ అగ్రహారం భూ సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు ఎమ్మార్వో, ఆర్డీవో, జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నా తగిన చర్యలు తీసుకోవట్లేదని, సాగులో లేని వ్యక్తికి పట్టాలు చేసారని, దీనిలో స్థానిక ఎమ్మార్వో అమ్ముడుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నవ యువ సమాఖ్య రాష్ట్ర నాయకులు నందారపు భాస్కరరావు, రైతు కూలీ సంఘం సభ్యులు మరిసా నరేష్, గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

అప్పుడు వ్యతిరేకించి...ఇపుడు మాట్లాడరేం!

- బల్క్‌డ్రగ్ పార్క్‌పై హోంమంత్రిని నిలదీసిన మత్స్యకారులు


హోంమంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాజయ్యపేట మత్స్యకారులు

నక్కపల్లి : తీరప్రాంత గ్రామాల్లో నివసించే మత్స్యకారులు ప్రాణాలు హరించే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన మత్స్యకారులు హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. గురువారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్స్యకారులు మంత్రిని కలిసారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిక్కి తాతీలు ఆధ్వర్యంలో వందలాది మంది మంత్రిని కలిసి తమ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గతంలో మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇటువంటి ప్రమాదకర పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించి ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. రెండు వేల ఎకరాల్లో బల్క్ డ్రగ్‌పార్క్‌లో వందల రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తీర ప్రాంతం శ్మశానంగా మారుతుందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు హానికలిగించే పరిశ్రమలు ఏర్పాటుకు తాము వ్యతిరేకమని చెప్పి, ఇపుడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరఫున ఎందుకు ఆమోదిస్తున్నారని ప్రశ్నించారు. భూసేకరణ సమయంలో ప్రాణాలు తీసే ఇటువంటి ప్రమాదకర పరిశ్రమలు వస్తాయని మాకు చెప్పలేదన్నారు. అప్పుడే చెప్పి ఉంటే భూములు ఇచ్చే వాళ్లం కాదన్నారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్ పార్క్‌ను అక్కడి ప్రజలు, టీడీపీ నాయకులు వ్యతిరేకించడంతో విరమించుకుని, అదే పార్క్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారంటే... వారివే ప్రాణాలా, మావి ప్రాణాలు కాదా? అంటూ పలువురు మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న నాయకులను ప్రజలను ఇళ్లకు వెళ్లి పోలీసులు బెదిరిస్తున్నారన్నారు. ప్రజలు ఉద్యమిస్తే ఆపడం ఎవరి తరం కాదన్నారు.

రోడ్డు మధ్య నిలిచిపోయిన లారీ..


గన్నవరం మెట్ట వద్ద ప్రయాణికులు అవస్థలు

- రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అవస్థలు

నాతవరం : నర్సీపట్నం తుని మధ్య అర్‌అండ్‌బీ రోడ్డుపై గన్నవరం మెట్ట సమీపంలో ట్రాఫిక్ అంతరాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు జిల్లాల సరిహద్దులో గన్నవరం మెట్ట వెదుళ్లగెడ్డ వద్ద సిమ్మెంటు లోడుతో పెద్ద లారీ రోడ్డు మధ్యలో కూరుకుపోయింది. వాహనాలు రాకపోకలు సాగించలేని విధంగా రోడ్డు మధ్యలో ఉండిపోవడంతో నర్సీపట్నం తుని డిపోల నుంచి రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు సుమారుగా రెండు గంటలు నిలిచిపోయాయి. అదే విధంగా ఇతర ప్రైవేటు వాహనాలు సైతం నిలిచిపోవడంతో అటు కోటనందూరు ఇటు ఎ.శరభవరం వరకు వాహనాలు రోడ్డుపై నిలిచి పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పొక్లెయిన్ సాయంతో సిమెంటు లారీని పక్కకు తీయడంతో వాహనాలు రాకపోకలు సాగించాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రైలు సమయం దాటిపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి గురయిన ఆటోను పరిశీలిస్తున్న ఎస్‌ఐ విభీషణరావు

ఎస్.రాయవరం : ధర్మవరం-ఎస్.రాయవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ధర్మవరం సమీపంలో రెండు ఆటోలు ఎదురెదురుగా గురువారం ఢీకొట్టుకోవడంతో ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఈ ప్రమాదంలో పెనుగొల్లు గ్రామానికి చెందిన సీహెచ్. సుశీలకు కాలు విరిగినట్టు చెప్పారు. ఎస్.రాయవరానికి చెందిన పెద్దేటి కొండలరావు, రాజులమ్మలకు గాయాలయ్యాయి. వారిని చికిత్సకు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కాలు విరిగిన మహిళను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

31న ఐద్వా జిల్లా మహా సభలు


ఐద్వా సభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

- రాంబిల్లిలో పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి(అచ్యుతాపురం) : ఈ నెల 31వ తేదీన కశింకోటలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఐద్వా మహాసభల్ని విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ మంగతాయారు కోరారు. గురువారం రాంబిల్లిలో ఐద్వా జిల్లా మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతకుప్రమాదకరంగా మారిన మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరారు. అసాంఘిక వ్యక్తులకు మత్తు పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ లభించడం వల్ల వారు మత్తులో విచక్షణా రహితంగా ప్రవర్తిస్తూ మహిళలపై దాడులు చేస్తున్నారని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదం చేసేందుకు డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. మత్స్యకార మహిళలకు ఉపాధి కల్పించాలని, రాంబిల్లి మండలంలో ఉచిత బస్సును ఉపయోగించుకునే వెసులుబాటు కోసం బస్సుల సంఖ్య విరివిగా పెంచి అన్ని మార్గాల్లోనూ తిప్పాలని కోరారు. బ్రాండిక్స్‌లో మహిళలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, లక్ష్మి,దేవి, జగదీశ్వరి, తలుపులమ్మ, పైడమ్మ,మాతమ్మ,కనకమహాలక్ష్మి,రామలక్ష్మి,వెంకటలక్ష్మి,రమణమ్మ, వరహాలు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ఆటోడ్రైవర్లు

- స్త్రీశక్తి పథకంతో రోడ్డున పడ్డామని ఆవేదన
- దేవరాపల్లిలో ఆటోలు నిలిపి నిరసన


దేవరాపల్లిలో రోడ్డుపై ఆటోలు నిలిపి ఆందోళనకు దిగిన ఆటో డ్రైవర్లు

దేవరాపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో తమ ఉపాధికి గండి పడిదంటూ దేవరాపల్లిలో ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. స్థానిక శివాలయం వద్ద ప్రధాన రోడ్డులో ఆటోలను నిలిపి వేసి పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమ ఉపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో నెలకు రూ.10 వేలు, రూ. 12 వేలు వేతనం తీసుకునే చిరు ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను అనర్హులుగా ప్రకటించిన ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత బస్సు ప్రయాణం ఎలా కల్పించారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏడాదికి రూ. 10 వేలు చొప్పున అందిస్తామని ప్రభుత్వం చెబుతుందని, తమ పిల్లల పాల ప్యాకెట్లకు కూడా ఇవి సరిపోవన్నారు. తమకు నెలకు రూ. 4 వేలు పింఛన్ రూపంలో అందజేసి ఆదుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో దేవరాపల్లి, నాగయ్యపేట, కాశీపురం, తామరబ్బ, గరిశింగి, తెనుగుపూడి, వాలాబు తదితర గ్రామాల డ్రైవర్లు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ బస్సు ప్రారంభం నేడు

డాబాగార్డెన్స్: పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'హాప్ ఆన్..హాప్ ఆఫ్' డబుల్ డెక్కర్ ఎలక్ట్రికల్ బస్సులను సీఎం చంద్రబాబు శుక్రవారం ఆర్‌కే బీచ్ వద్ద ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌కే బీచ్‌లోని కాళీమాత ఆలయం సమీపంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అవసరమైన స్టాళ్లు, టికెట్ కౌంటర్లు, పోడియం, మైక్ సిస్టమ్, బ్యాక్‌డ్రాప్, జెండాలు, క్యాప్స్, టీ షర్టులు వంటివి సిద్ధం చేయాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ రాజు, జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి మాధవి, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడులకు సూచించారు.

తెలుగు భాష మాధుర్యాన్ని తెలుసుకోండి


శ్రీ ప్రకాష్‌లో తెలుగు భాష దినోత్సవం

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్‌లో తెలుగు భాష దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, పెద్దాపురం మహారాణి కళాశాల విశ్రాంత ఆచార్యులు డా. జోస్యుల కృష్ణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న అంతర్గత శక్తులను వెలికి తీయాలని, మాతృభాష పట్ల మమకారం కలిగి ఉండాలని అన్నారు. గ్రాంధిక భాషను వ్యవహారిక భాషలోకి తీసుకురావడానికి గిడుగు రామమూర్తి అహర్నిశలు కృషి చేశారని, ఆయన జీవిత విశేషాలను, ఆధునిక కవులు, వివిధ సాహితీ ప్రక్రియలు విద్యార్థులకు పరిచయం చేసి, తెలుగు భాష మాధుర్యాన్ని విద్యార్థి దశ నుంచే తెలుసుకునేలా కృషి చేయాలని అన్నారు. పోతన పద్యాలను విద్యార్థులందరూ అలపించిన తీరు, సుమతి శతక పద్యాలను అలపించిన విధానం చాలా బాగుందని, సామెతలతో జరిగిన సరదా సంభాషణ తనను ఎంతగానో ఆకట్టుకుందని విద్యార్థులను కొనియాడారు. ప్రతి ఒక్కరూ కుమారి శతకం, కృష్ణ శతకం, సుమతీ శతకంలోని పద్యాలు రోజుకు ఒకటి చొప్పున నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, ఆకడమిక్ ఇన్‌చార్జ్‌లు డి.వి. శ్రీనివాస్, అపర్ణ, నీలాదేవి, సంధ్యారాణి పాల్గొన్నారు.

రామాలయానికి తాళం వేసిన టీడీపీ నేతలు


రామాలయానికి వేసిన తాళాలను చూపుతున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: కూటమి నేతలు గ్రామాల్లో అరాచకాలకు పాల్పడుతున్నారు. అందుకు అనకాపల్లి జిల్లా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వగ్రామమైన వెన్నలపాలెం వేదికగా మారడం గమనార్హం. వినాయక చవితి వేడుకలు సందర్భంగా గ్రామంలోని రామాలయానికి కూటమి నాయకులు తాళాలు వేయడం వివాదానికి దారితీసింది. రామాలయంలో వినాయకుడిని నిలిపి సర్పంచ్ తొలిపూజ చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు తొలి పూజ చేసేందుకు భక్తులతో కలిసి బుధవారం ఉదయం 6 గంటలకు రామాలయానికి రాగా, అప్పటికే టీడీపీ నాయకులు ఆలయానికి తాళాలు వేసి వెళ్లడంతో అంతా అవాక్కయ్యారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావుతో రామాలయాన్ని వెంటనే తెరిపించాలని వాగ్వావాదానికి దిగారు. టీడీపీ నాయకులకు పోలీసులు వంత పాడడంతో వారి అరాచకాలు, దాడులకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని సర్పంచ్ అప్పారావు ఆరోపించారు. ఎట్టకేలకు సీఐ మల్లికార్జునరావు కల్పించుకుని తాళాలు తెరిపించి, సర్పంచ్ అప్పారావు దంపతులతో తొలిపూజలు జరిపించడంతో ఘర్షణ సద్దుమణిగింది.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం

నర్సీపట్నం: క్రీడాకారులకు ప్రభుత్వం తీపికబురు అందించిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులు లబ్ధి పొందేలా రూ.4.9 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. క్రీడలకు నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

క్లుప్తంగా

ఎకరాకు 25 కేజీల యూరియా చాలు



బవులవాడలో అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: వరి నారుమళ్లు వేసుకునే రైతులు ఎకరానికి 25 కేజీలు కాంప్లెక్స్, 25 కేజీలు యూరియా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలో బవులవాడ గ్రామంలో గురువారం ఆయన అవగాహన కల్పించారు. పై మోతాదులో ఎరువులు వాడడం వల్ల పంట దిగుబడి బాగుంటుందన్నారు. వరిలో జింకులోపం కనపడుతుందని, నివారణకు జింక్ 10 కేజీలు చొప్పున ఎకరానికి వేసుకోవాలన్నారు. గడ్డికి యూరియా వాడవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయ్, సర్పంచ్ వెంకట అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్‌కుమార్, ఏపీసీ ఎస్ఎఫ్ సత్యారావు, రైతులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండలాధ్యక్షునిగా ప్రసాదరావు



పీఆర్టీయూ మండల కమిటీని అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

కశింకోట: పీఆర్టీయూ మండల అధ్యక్షునిగా అల్లంక ప్రసాదరావు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్ సమక్షంలో గురువారం కశింకోటలో మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా గాడి శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా గుంటుకు హేమకుమారి, ప్రధాన కార్యదర్శిగా గొర్లి కేశవకుమార్, మహిళా కార్యదర్శిగా పెంటకోట కమల, కార్యదర్శులుగా చిలకపాటి విమల, రెడ్డి గౌరీశంకర వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షునిగా మైచర్ల శంకరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ మాట్లాడుతూ మండల విద్యా శాఖ అధికారి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించారు.

అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐగా శేషగిరిరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న శేషగిరిరావు

అనకాపల్లి: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా శేషగిరిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డీసీఆర్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహించి సాధారణ బదిలీలో భాగంగా అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా కాస్త తగ్గుముఖం పట్టింది. కిలో రూ.60 నుంచి రూ.50కి తగ్గింది. ఉల్లి రూ.30 నుంచి రూ.25కు తగ్గింది. బంగాళదుంప ఎప్పటిలాగే రూ.30, వంకాయ, బెండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, చామదుంప, బీరకాయ రూ.60కు అమ్మకాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 42 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	3,450	3,450
మూడోరకం	3,350	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	:బార్బరిక్
సత్యనారాయణ స్క్రీన్-1	:కొత్త లోక
పర్తిసాయి	: అర్జున్ చక్రవర్తి
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	:సుందర కాండ
శ్రీ సత్య	: హరి హర వీరమల్లు
రామచంద్ర	: వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-39, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.



అనకాపల్లి టౌన్:గాంధీనగరంలో ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో పూజలు చేస్తున్న ఆర్డీవో షేక్ అయిషా



అనకాపల్లి టౌన్:వాడ్రాపల్లి వేంకటేశ్వరస్వామి రూపంలో ఆకర్షిస్తున్న వినాయకుడు



అనకాపల్లి టౌన్:ఆకట్టుకున్న రామసేతు బ్రిడ్జిపై వానరులు రాళ్లు తెస్తున్న సెట్



అనకాపల్లి టౌన్:పార్వతీదేవికి జడలు వేస్తున్న కుమారులు సెట్

విఘ్న రాజాయ.. విశ్వరూపాయ

విఘ్నాలు తొలగించు వినాయక

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు

సర్వ విఘ్నాలు తొలిగించే దేవుడు వినాయకుడు. ఆ ఆదిదేవుడు వాడవాడాలా కొలువుదీరాడు. ఊరూరా సర్వాంగ సుందరంగా ముస్తాబైన మండపాల్లో కొలువుదీరిన స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. నిర్విఘ్నం కురుమే దేవా.. సర్వ కార్యేషు సర్వదా! అంటూ పూజించారు. బుధవారం వినాయక చవితి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఎక్కడ చూసినా గణపతి పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



అనకాపల్లి టౌన్:వేగివారి వీధిలో రామావతారంలో వినాయకుడు



కశింకోట దుర్గాలమ్మ ముఖ ద్వారం వద్ద వినూత్న వినాయకుడు



అనకాపల్లి టౌన్:కోట్నివీధిలో నందివాహనంపై వినాయుకుడు

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పందిళ్లు, గృహాల్లోనూ భక్తులు తమ శక్తికొద్దీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొని భక్తిశ్రద్ధలతో పూజించారు. గారెలు, బూరెలు, ఉండ్రాళ్లు, ఆవిరి కుడుములు, పిండి వంటలు తయారు చేసి, మార్కెట్లో కొనుగోలు చేసిన మిఠాయిలు, పండ్లు, పూలు, పత్రిని వినాయకుడికి నైవేద్యంగా సమర్పించారు. పాలవెల్లి కట్టి, చిన్నారులు తాము చదువుకొనే పుస్తకాలను పెట్టి తమకు విద్యాబుద్ధులు అందాలని ప్రార్థించగా, పెద్దలు తమ పనులకు ఆటంకాలు లేకుండా చూడాలని వేడుకున్నారు.

స్వామివారికి ఆర్డీవో ప్రత్యేక పూజలు

గాంధీనగరంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరి వద్ద ఆర్డీవో షేక్ అయిషా స్వయంగా పాల్గొని పూజలు నిర్వహించారు. గృహాలలో ఏర్పాటే చేసిన గణపతి విగ్రహాలను సాయంత్రం నాలుగు గంటల నుంచి పట్టణంలోని శారదానది ఒడ్డున, మండలంలోని కొత్తూరు, తుమ్మపాల ఏలేరు కాలువల దగ్గర నిమజ్జనం చేశారు.

శారదా నదిలో నిమజ్జనం..

పట్టణ వాసులు శారదానది ఒడ్డుకు అధిక సంఖ్యలో చేరుకుని రాత్రి 8 గంటల వరకు నిమజ్జనాలు చేశారు. ఇక్కడ నిమజ్జనం చేసేటప్పుడు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ కమిషనర్ కె. చక్రవర్తి పారిశుధ్య సిబ్బందిని నియమించి పత్రి, తదితర పూజా సామగ్రిని నదిలో కలపకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గణపతి విగ్రహాలను మాత్రమే నదిలో కలిపేంచేలా అవగాహన కల్పించారు.

పోలీసు బందోబస్తు

నది వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి నది లోపలికి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బదోబస్తు ఏర్పాటు చేశారు. పలు వీధులలో యూత్ అసోసియేషన్లు వినూత్నంగా ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న 126 అడుగుల వినాయక విగ్రహం ..ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 126 అడుగుల వినాయక విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. వేల్పులవీధిలో ఏర్పాటు చేసిన 36 అడుగుల వినాయకుని విగ్రహం, గవరపాలెం వేగివారి వీధిలో రామవతారంలో వినాయకుడు, కోట్ని వీధిలో నంది వాహనంపై ఏర్పాటు చేసిన వినాయకుడు, పరమశివుడు విగ్రహం, వర్తక సంఘం ఘోషా ఆస్పత్రి పక్కన్న ఏర్పాటు చేసిన రామసేతు బ్రిడ్జిపై వానరులు రాళ్లు పేర్చుతూ రాముడితో మాట్లాడుతున్న హనుమంతుని సెట్, అగ్గి మర్రిచెట్టు సమీపంలో ఏర్పాటు చసిన పార్వతీ దేవికి జడలు వేస్తున్న కుమారులు వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి సెట్, వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరుని ఆలయం పక్కన్న ఏర్పాటు చేసిన వాడ్రాపల్లి వేంకటేశ్వర స్వామి అవతారంలో వినాయకుడి ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అలరిస్తున్న సప్త గుర్రాలపై కొలువైన 16 అడుగుల వినాయక విగ్రహం ....కశింకోట: మండలంలో వినాయక ఉత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు వీధులు, గ్రామాల్లో వినూత్నంగా వినాయక విగ్రహాలు, ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఇవి ఆహుతులను విశేషంగా అకట్టుకుంటున్నాయి. తాళ్లపాలెం కూడలిలో సప్త గుర్రాలపై కొలువైన 16 అడుగుల వినాయక విగ్రహం విశేషంగా అలరిస్తోంది. కశింకోటలోని గవరపేట, కస్పావీధి, ద్వారపురెడ్డి వీధి, అమరపల్లి వీధి, సంతబయల ఎస్సీ కాలనీ, అగ్రహారం, పెద్ద బజారు, రౌతు వీధి, పూసర్ల వీధి, మేదర వీధి, కనకమహాలక్ష్మి వీధి, వడ్డి వీధి, గోవిందరావు కాలనీ, వైఎస్సార్ మెగా లే అవుట్, గౌరమ్మ ఆలయం, హౌసింగ్ కాలనీ, కోమటి వీధి, సలాది వీధి, సత్తెమ్మ కాలనీ, పందిరి వీధి, అఫీషియల్ కాలనీ, ఇందిరా కాలనీ, సాయినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విగ్రహాలు, ప్రతిమలు నెలకొల్పారు. బయ్యవరం, నరసింగబిల్లి, చింతలపాలెం, నూతలగుంటపాలెం, జి. భీమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, అచ్చెర్ల, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, కొత్తపల్లి, తేగాడ, పేరంటాలపాలెం, తదితర గ్రామాల్లోనూ వినాయక విగ్రహాలను వినూత్నంగా నెలకొల్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ముందుగా డప్పులు, వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఊరేగించిన అనంతరం విగ్రహాలను నెలకొల్పి సంప్రదాయంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రసాద వితరణ చేశారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లలో వినాయక విగ్రహాలు, ప్రతిమలతో సంప్రదాయంగా వినాయక వ్రతాలు, పూజలు నిర్వహించి అత్యధిక మంది సాయంత్రం స్థానిక శారదా నది, చెరువు, గెడ్డల్లో నిమజ్జనం చేశారు.



అనకాపల్లి టౌన్: శారదానది ఒడ్డున నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ప్రజలు



కశింకోట: సాయినగర్‌లో నెలకొల్పిన నెమలి వినాయకుడు



కశింకోట:తాళ్లపాలెం కూడలిలో ఆహూతులను ఆకట్టుకుంటున్న సప్త గుర్రాలపై కొలువై ఉన్న 16 అడుగుల వినాయకుని అతి పెద్ద విగ్రహం

బస్సుల్లో పురుషుల సీట్లు మహిళలకు వద్దు



జిల్లా అధికారి ప్రవీణకు వినతిపత్రం అందజేస్తున్న నియోజకవర్గ కన్వీనర్ హరనాథ్‌బాబు

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల పురుషులు ఇబ్బందులు పడుతున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్ బాబు వాపోయారు. ఈ మేరకు పురుషుల సీట్లు వారికి మాత్రమే కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని గురువారం ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి వి.ప్రవీణకు వినతిపత్రం అందజేశారు. వివిధ పనులపై సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లే పురుషులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆటో కార్మికుల పొట్ట కొడుతున్న కూటమి

- మహిళలకు ఉచిత బస్ కారణంగా ఉపాధి కోల్పోయాం
- పెందుర్తిలో వందలాది ఆటోలు నిలిపేసి కార్మికుల నిరసన



పెందుర్తి కూడలిలో దిగిన ఆటో కార్మికుల ఆందోళన




పెందుర్తిలో నిలిపేసిన ఆటోలు

పెందుర్తి: 'ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు మేం వ్యతిరేకం కాదు. కానీ పథకాలు ప్రకటించినప్పుడు.. వాటిని అమలు చేసినప్పుడు ఆ ప్రభావం మరో రంగంపై పడకుండా చూసుకోవాలి. ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తుంది. దీనివలన ఎందరో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది.' అంటూ పెందుర్తిలో వందలాది మంది ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఆటో స్టాండ్ల సభ్యులంతా ఎక్కడికక్కడ ఆటోలను నిలిపేసి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని వెల్లగక్కారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వం తమ కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్ ప్రయాణం అమలు చేసే ముందు రాష్ట్రంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికుల కుటుంబాల గురించి ఆలోచించకుండా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. తక్షణమే తమ జీవితాలకు భరోసా ఇవ్వకపోతే.. అతిత్వరలోనే తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని ప్రకటించారు.

'చంద్రబాబు పాపానికి పాతికేళ్లు'

- బషీరాబాగ్ దమనకాండ చంద్రబాబు క్రూరత్వానికి నిదర్శనం
- విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినంలో సీపీఎం ధ్వజం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న వారిని చంద్రబాబు ప్రభుత్వం కర్కశంగా పొట్టనపెట్టుకున్న పాపానికి పాతికేళ్లు నిండాయని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ ఆక్షేపించారు. ప్రపంచ బ్యాంక్ షరతులకు లొంగి ఆనాడు తీసుకున్న విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకించిన వారిని పోలీసులతో మట్టుబెట్టించిన తీరు ఆయన క్రూరత్వానికి నిదర్శనమన్నారు. బషీరాబాగ్ దమనకాండకు పాతికేళ్లు నిండిన సందర్భంగా గురువారం సుజాతనగర్‌లో విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం జరిపిన పోలీస్ కాల్పుల్లో మరణించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నేటికీ కూటమి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశిత సంస్కరణలనే అమలు చేస్తోందని ఆరోపించారు. అందుకే విద్యుత్ రంగాన్ని అదానీ చేతుల్లో పెట్టి ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధమైందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలో ఉండి కార్పొరేట్లకు సంపద పోగేసేందుకే ప్రయత్నం చేస్తున్నాయి తప్ప, సామాన్య ప్రజలకు మేలు చేయాలన్న తలంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి, వామపక్షాలు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ సభ్యులు బి.వెంకట్రావు, కె.అప్పలనాయుడు, ప్రభుదేవా, జగన్నాథస్వామి, లక్ష్మణరావు, మహేష్, లక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఛలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

సబ్బవరం:పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే నినాదంతో ఏపీసీపీఎస్ఈఏ వచ్చే నెల 1న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి పోస్టర్‌ను అవిష్కరించారు. హెచ్ఎం బోసు భారతి, సబ్బవరం మండల సీపీఎస్ బాధ్యులు వనం భాస్కర్, డెక్క శ్రీను, ఎర్నిబాబు, ప్రసాద్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ



పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

మునగపాక: పీఏసీఎస్ కార్యాలయం ద్వారా గురువారం యూరియా పంపిణీ నిర్వహించారు. ఇటీవల సొసైటీకి వచ్చిన యూరియాను రైతులకు అందజేస్తున్నారు. గతంలో యూరియా లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించారు. సీజన్‌కు అవసరమయ్యే యూరియాను దఫదఫాలుగా పంపుతున్నారు. ఇప్పటికే దమ్ములు వేగవంతం చేసే పనిలో ఉండడం, దీనికి తోడు యూరియా ఆవశ్యకత కారణంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వచ్చారు. గురువారం ప్రతీ రైతుకు ఒక్కొక్క బస్తా మేర అందజేశారు,

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

పరవాడ: మహిళా చట్టాలపై పూర్తి అవగాహన పొందేందుకు విద్యార్థినులు ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత నెల 29న విద్యార్థినిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై స్పందిస్తూ గురువారం కళాశాలను సందర్శించి బాధిత విద్యార్థినిని పరామర్శించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళా శిశు సంక్షేమం ద్వారా అందిస్తున్న సేవలు, ఆడ పిల్లలు, మహళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొంటున్న భద్రత చర్యలను వివరించారు.

పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ ఆడ పిల్లలు, మహిళల కోసం విశేష సేవలను అందించడానికి 181, 100, 101, 1098, 1930 హెల్ప్‌లైన్ల ప్రాముఖ్యతను తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మాట్లాడుతూ ఆడ పిల్లలు ధైర్యంగా, ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అనకాపల్లి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి, సబ్బవరం సీడీపీవో లలితకుమారి, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు, తహసీల్దార్ బి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భరత్‌కుమార్ జన్మదిన వేడుకలు



భరత్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే గణేష్



ఏఎస్ పేటలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి/కశింకోట: స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కేక్ కట్ చేసి భరత్‌కుమార్‌కు తినిపించారు. అంతకుముందు పార్టీ శ్రేణులు భరత్‌కుమార్‌ను శాలువాలు, గజమాలలతో ఘనంగా సత్కరించారు. రింగ్‌రోడ్డు నెట్ క్రికెట్ టోర్నమెంట్‌లో కోట్ని వీధికి చెందిన వరుణ్ 11 జట్టుకు, ఎన్టీఆర్ క్రీడా మైదానం జట్టుకు ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.10 వేలు, జ్ఞాపికలు భరత్‌కుమార్ అందజేశారు. కశింకోట మండలం ఏఎస్ పేటలోని తన స్వగృహంలో పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యుల నడుమ కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గాల సమన్వయకర్తలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నపురెడ్డి అదీప్‌రాజు, కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొడ్డేడ శివ, దంతులూరి దిలీప్‌కుమార్, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, 82, 83 వార్డు కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు, పార్టీ మండలాధ్యక్షులు మలసాల కిషోర్, పెదిశెట్టి గోవింద్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షువు వేగి త్రినాథ్, 80, 84 వార్డు ఇన్‌చార్జులు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ, పీడీ గాంధీ, బొడ్డేడ శివ, బొడ్డేడ లక్ష్మీనరసింహం, విల్లూరి చంద్రశేఖర్, పల్లేల సాయి కిరణ్, ప్రభాకర్, యశ్వంత్, కాండ్రేగుల హైమావతి, నీటిపల్లి లక్ష్మి, పద్మకుమారి పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు

మాడుగుల రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునిగింది. వారం రోజులుగా కురిసిన వర్షాల వల్ల వరి పంట నీట మునిగింది. మళ్లీ అకస్మాత్తుగా వర్షాలు కురవడంతో రైతాంగం అందోళన చెందుతున్నారు. మండలంలో వీరవల్లి శివారు కొత్తూరు వద్ద పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.